స్థానికేతరులకే 'ఉపాధి'

- హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానికులకు మొండి చెయ్యి
- కాంట్రాక్టర్లతో కార్మిక సంఘాల కుమ్మక్కు
- స్థానిక నిరుద్యోగుల్లో ఆందోళన



హెచ్‌పీసీఎల్ ముఖ ద్వారం



పనులకు వెళ్తున్న స్థానికేతర కార్మికులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో భారీ పరిశ్రమ అయిన హెచ్‌పీసీఎల్‌లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కలగా మారింది. సంస్థ కోసం భూములు ఇచ్చిన వారి పిల్లలకు కాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి కాంట్రాక్ట్ పనులు కేటాయించడంతో స్థానిక నిరుద్యోగులు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్నారు. వీరికి అండగా నిలవాల్సిన కార్మిక సంఘాలు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

మల్కాపురం గ్రామాన్ని అనుకుని ఉన్న హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) సంస్థలో రూ.26 వేల కోట్ల రూపాయలతో నాలుగేళ్లుగా విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనులను ఎల్ అండ్ టీ, రఫ్, పెట్రో ప్యాక్, టెక్నిప్ తదితర ప్రైవేట్ సంస్థలు చేపడుతున్నాయి. విస్తరణ పనులకు ముందుగా హెచ్‌పీసీఎల్ యాజమాన్యం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులకు 70శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆ చర్చల్లో ఎమ్మెల్యే గణబాబు కూడా ఉన్నారు. విస్తరణ పనులు మొదలై సంవత్సరాలు గడుస్తున్నా అనుకున్నంతగా స్థానికులకు ఉపాధి అవకాశాలను కాంట్రాక్టర్లు కల్పించడం లేదు. దీనిపై యాజమాన్యం కూడా స్పందించడం లేదు.

ఇతర రాష్ట్రాలవారే అధికం

కాంట్రాక్టర్లు బీహార్, ఉత్తర ప్రదేశ్, ఒడిశాత తదితర రాష్ట్రాల నుంచి సుమారు 5వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను తీసుకువచ్చి ఇక్కడ పనులు చేయిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఉన్నత చదువులతో పాటు అనుభవం ఉన్న స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికే కాంట్రాక్టర్లు అధికంగా అవకాశాలు కల్పిస్తున్నారు. స్థానికులకైతే ప్రభుత్వ జీవో ప్రకారం వేతనాలు, ఫైనల్ సెటిల్ మెంట్, ఈఎస్ఐ, పీఎఫ్‌లతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వాల్సి ఉంటుంది. స్థానికేతర కార్మికులకు జీవో ప్రకారం చెల్లింపులు ఉండవు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు అంతగా ఉండవు. అలవెన్సుల ఊసే ఉండదు. దీంతో స్థానికుల కంటే స్థానికేతరులకే కాంట్రాక్టర్లు ప్రాధాన్యం ఇస్తున్నారు.

పుట్టగొడుగుల్లా యూనియన్లు ఉన్నా..

స్థానికులకు ఉపాధి కల్పనపై ప్రశ్నించాల్సిన ట్రేడ్ యూనియన్ నాయకులు, పాలకులు నోరు మెదపకపోవటం వెనుక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు మొదలు కాకముందు కేవలం ఐదు లేదా ఏడు ప్రధాన ట్రేడ్ యూనియన్లు ఉండేవి. ప్రస్తుతం 26కు పైగా యూనియన్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇన్ని యూనియన్లు ఉన్నా స్థానిక నిరుద్యోగులకు ఉపాధి మాత్రం సాధించలేకపోతున్నాయి. పేరున్న యూనియన్లతో పాటు కొత్త యూనియన్ల ప్రతినిధులు కాంట్రాక్టర్లకు గులామ్‌గిరీ చేస్తుంటే తమ బతుకులు ఇంకెలా ఉంటాయని స్థానిక నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు.

వెల్డర్‌గా 20 ఏళ్లు అనుభవమున్నా..



హెచ్‌పీసీఎల్ కోసం మా భూములిచ్చాం. వెల్డర్‌గా నాకు 20ఏళ్ల అనుభవం ఉంది. కానీ ఏ కాంట్రాక్టర్ నాకు ఉపాధి కల్పించకపోవడం బాధగా ఉంది. యూనియన్ నాయకులు కూడా పట్టించుకోవడం లేదు. విషయానుభవం లేని స్థానికేతర కార్మికులు విస్తరణ పనుల్లో ఉపాధి పొందుతుంటే మాలాంటి వారు రోడ్డున పడుతున్న పరిస్థితి. – బొట్ట సైదన్న, గొల్లవీధి, మల్కాపురం

హెల్పర్‌గా కూడా అవకాశం లేదు



కలాసీగా, రిగ్గర్‌గా వివిధ సంస్థల్లో సుమారు 15 సంవత్సరాలకు పైగా పని చేశాను. విస్తరణ పనుల్లో కలాసీ లేదా రిగ్గర్‌గా లేదా కనీసం హెల్పర్‌గా అయినా ఉపాధి అవకాశం కల్పించమని ట్రేడ్ యూనియన్ వారిని, కాంట్రాక్టర్‌ను వేడుకున్నాను.అయినా ఫలితం లేదు.

– రాజారావు, మార్కెట్ లైన్, మల్కాపురం

పనుల కోసం దూర ప్రాంతాలకు ..



కార్పెంటర్‌గా నాకు 35 ఏళ్ల అనుభవం ఉంది. హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో కార్పెంటర్‌గా కానీ, కలాసీగా గానీ ఉపాధి కల్పించాలని రెండేళ్లుగా కాంట్రాక్టర్లను, యూనియన్ నాయకులను ప్రాధేయపడుతున్నా ఫలితం లేదు. దీంతో పనుల కోసం భీమిలి, కూర్మన్నపాలెం, అనకాపల్లి వెళ్లాల్సి వస్తోంది.

– అప్పలరాజు, పల్లివీధి, మల్కాపురం

క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఏఈవో శ్రీనివాసరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని మల్కాపురానికి చెందిన కాపు దుర్గేశ్వరరావు అనే దాత గురువారం రూ.1,00,116 విరాళాన్ని నగదురూపంలో ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు అన్నప్రసాద బాండ్‌ని ఏఈవో పిల్లా శ్రీనివాసరావు అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఆలయ అధికారులు అందించారు. కార్యక్రమంలో అన్నప్రసాద విభాగం ఉద్యోగి కాశి పాల్గొన్నారు.

ఎస్ఐ ప్రసాద్ బాధ్యతల స్వీకరణ



విధుల్లో చేరిన ఎస్ఐ ప్రసాద్

గోపాలపట్నం: ఎయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా సీహెచ్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా బత్తిలి నుంచి బదిలీపై వచ్చారు. సీఐ చక్రధరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సీఐ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఒరియా కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే గణబాబుకు సమస్య వివరిస్తున్న ఒరియా సంఘ పెద్దలు

సింధియా : జీవీఎంసీ 63వ వార్డులో నివసిస్తున్న ఒరియా కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఆ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న తెలిపారు. 63వ వార్డులో ఉంటున్న ఒరియా కులస్తులకు కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో గ్రామ ప్రెసిడెంట్ పట్నాయక్, కుల పెద్ద సాహు, టీడీపీ నాయకులు కార్పొరేటర్‌కు తెలియజేశారు. స్పందించిన ఆయన ఎమ్మెల్యే గణబాబు దృష్టికి సమస్య తీసుకెళ్లగా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిద్దామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో ఒరియా సంఘం సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

పాత్రికేయుల చేయూత

మల్కాపురం: ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయాలపాలై ఇబ్బంది పడుతున్న పాత్రికేయుడు మూర్తికి పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం (ప్రింట్ మీడియా) ప్రతినిధులు, సంఘ సభ్యులు చేయూతనందించారు. ఆయనకు కొంత ఆర్థిక సాయం అందించి, ఆదుకున్నారు.

జేవీవీ సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : జన విజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో నిర్వహించనున్న సైన్స్ సంబరాలు 2024 పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ గురువారం ఆవిష్కరించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి చెందడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని ఈ సందర్భంగా ఆయన అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేసి బావి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు జన విజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గాజువాక మండల విద్యాశాఖాధికారులు విశ్వనాథం, సునీత, జిప్సా అధ్యక్షుడు భాస్కరరావు, ప్రతినిధులు గిరీష్ శ్రీనింఆస్, కె.వి.సత్యనారాయణ, ఎం.రంగనాథ్ పాల్గొన్నారు.

గణనాథుని సన్నిధిలో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ పీవీ సురేష్



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 62వ వార్డు అచ్చెంనాయుడులోవలో మూన్ ఫ్రెండ్స్ వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిల్ల కన్నబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు రామకృష్ణ, సంతోష్, ఉత్సవ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డు దుర్గానగర్‌లో..

సింధియా: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 62వ వార్డులో దుర్గానగర్‌లో గణేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన పశ్చిమ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి, సురేష్, నీలంరాజు, వరహాలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

60వ వార్డులో భారీ అన్నసమారాధన

మల్కాపురం : జీవీఎంసీ 60వ వార్డు పరిధి రెండు గుళ్ల యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పీవీ సురేష్ అన్నసంతర్పణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులంతా ఐక్యంగా చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతోపాటు అన్నసమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. శీరం ఉమామహేశ్వరి, తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న దొడ్డి కిరణ్

గణపతినగర్‌లో అన్నదానం

గోపాలపట్నం : వినాయక చవితి సందర్భంగా జీవీఎంసీ 89వ వార్డు గణపతినగర్‌లో గురువారం అన్నదానం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, డీకే ఫౌండేషన్ అధినేత దొడ్డి కిరణ్ ముందుగా మండపంలో వినాయకుని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. మీసాల పరమేష్, సంతోష్ ఆధ్వర్యంలో సుమారు 3 వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంతంలో పాక్షిక చర్యలు



కొండ చరియలు విరిగిన ప్రదేశంలో ఇసుక బస్తాలు వేయిస్తున్న జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు

గోపాలపట్నం : రామకృష్ణనగర్‌లో ఇటీవల కొండ చరియలు విరిగిపడిన చోట జీవీఎంసీ అధికారులు పాక్షికంగా చర్యలు చేపట్టారు. ఈ ప్రాంతంలో ఇసుక బస్తాలు వేయించి మట్టి కిందకు జారకుండా చేస్తున్నారు. ఈ పనులను జోనల్ కమిషనర్ హేమావతి పర్యవేక్షించారు. ఇప్పటి వరకు నాలుగు వరసలు వేశారు. ఇలా సగం ఎత్తు వరకు వేస్తామని అధికారులు చెబుతున్నారు. ఎగువ భాగాన గ్రౌటింగ్ చేయించి, జియో మెమ్బరింగ్ షీట్ వేస్తామని తెలిపారు. ఇది వర్షాలు పడినపుడు నీరు మట్టిలోకి చేరకుండా ఉండేందుకు వేస్తున్నామని పేర్కొన్నారు. అయితే ఈ పనులు పూర్తయిన తర్వాత సేఫ్టీ కమిటీ సూచనల తర్వాతే ఇక్కడ నివసించేందుకు అనుమతిస్తామని అధికారులు చెబుతున్నారు.

అంతా బిల్డర్ల ఇష్టం

- రోడ్లపై భవన నిర్మాణ సామగ్రి డంప్
- ప్రశ్నిస్తే ఎదురుతిరుగుతున్న బిల్డర్లు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని జీవీఎంసీ అధికారులు



గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో ఇలా..



గోకుల్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా కాంక్రీట్ పిక్కలు, ఇసుక



గౌరీనగర్‌లో ప్రమాదభరితంగా సామగ్రి

కంచరపాలెం: సామాన్యుల ఇబ్బందులతో సంబంధం లేకుండా బిల్డర్లు, కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రహదారులపై అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి డంప్ చేసేసి రాకపోకలకు విఘాతం కలిగిస్తున్నారు. జీవీఎంసీ 56, 57 వార్డుల పరిధిలోని పలు ప్రాంతాల్లో నిత్యం ఇదే పరిస్థితి ఉంటున్నా అధికారులు స్పందించడం లేదు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, వివేకానందవీధి, గొల్లకంచరపాలెం, తోటవీధి, గౌరీనగర్, గోకుల్‌నగర్, సుభాష్‌నగర్, తుమ్మడపాలెం, శ్యామ్‌నగర్, ఆశవానిపాలెం, సాకేతికపురం, తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కొందరు భవనాలు నిర్మిస్తుండడం... వీటితోపాటు జోన్ 5 టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో మరమ్మతులు చేస్తుండడంతో అవసరమైన ఇసుక, పిక్క వంటి సామగ్రిని తీసుకొచ్చి రోడ్ల మీద ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు. అంతేగాక వాటికి సంబంధించిన పనులు కూడా అక్కడే చేపట్టడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇరుకు రహదారుల్లో సామగ్రి, వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు, బిల్డర్లు ఘర్షణకు దిగుతున్నారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో తాము మాట్లాడుకున్నామని, మధ్యలో మీకెందుకని ప్రశ్నిస్తున్నారు. దీంతో వారి జోలికి ఎవరూ వెళ్లడం లేదు. మరికొంత మంది అయితే ఏకంగా తమ భవనాల శిథిలాలను తీసుకొచ్చి రోడ్లమీద ఇష్టానుసారంగా పడేస్తున్నారు. పిక్క, ఇసుక వంటి వాటిని రోడ్డు పక్కన ఉన్న బోర్లు, కుళాయిల వద్ద వేస్తుండడంతో స్థానికులు తాగునీరు పట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు చీకటి పడిన తర్వాత సమీపంలోని గెడ్డల్లో వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. ఇటీవల రహదారిలో డంప్ చేసిన పిక్కపై అనేక మంది ద్విచక్ర వాహనదారులు జారిపడిన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు వార్డుల్లో ఆయా ప్రాంతాల్లో పర్యటించి తగిన చర్యలు తీసుకొని సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

జారిపడుతున్నాం

రహదారిలో ఇంటి నిర్మాణ సామగ్రి రోజులు తరబడి ఉంచడంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగించేటప్పుడు జారీ పడిపోతున్నాం. తీవ్ర గాయాలు పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలి.

– సూరి అప్పారావు, గవర కంచరపాలెం

నడవడానికి ఇబ్బందులు

రోజులు తరబడి రోడ్లపై పిక్క, ఇటుకలు, ఇసుక డంప్ చేయడంతో పాదచారులు రాకపోకలు సాగించలేకపోతున్నాం. నడవడానికి వీలులేకుండా రహదారులను ఆక్రమిస్తున్నారు. తాగునీరు పట్టుకొవడానికి వీలులేకుండా బోర్లను ఆక్రమిస్తున్నారు.

–దుర్గాభవాని, గౌరీనగర్, ఊర్వశికూడలి

జాబ్ మేళాలో 46 మందికి ఉపాధి



మాట్లాడుతున్న సుబ్బిరెడ్డి



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు

పెందుర్తి: నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు చక్కని స్పందన లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ జాబ్‌మేళాకు 139 మంది హాజరు కాగా అందులో హెటిరో ల్యాబ్స్‌లో 25 మంది, కేఎల్ గ్రూప్‌లో 21 మంది ఉపాధి లభించిందన్నారు. ఫైజర్ కంపెనీలో ఐదుగురిని షార్ట్‌లిస్ట్ చేయాల్సి ఉందని వెల్లడించారు. అవి కూడా ఖరారైతే మొత్తం 51 మందికి ఉపాధి లభించినట్లవుతుందన్నారు. జాబ్‌మేళాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి సాయికృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మహాధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

దాబాగార్డెన్స్ : మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ విధ్వంసాన్ని ఆపి సెయిల్‌లో విలీనం చేయాలని, టీడీపీ, జనసేన కూటమి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్ రక్షణకు పూనుకోవాలని, ప్లాంటుకు సొంత గనులు, వర్కింగ్ క్యాపిటల్ ఇవ్వాలని, ప్లాంటును పూర్తి సామర్థ్యంతో నడిపించాలని, ఖాళీలు భర్తీ చేయాలని, నిర్వాసితులకు ఉద్యోగాలివ్వాలని, సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న పాత గాజువాకలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు విజ్ఞప్తి చేశారు. మహాధర్నా పోస్టర్ గురువారం సీపీఎం జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకు అధికారం ఇవ్వండి.. స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదు.. ప్రభుత్వ రంగంలో మరింత బలోపేతం చేస్తాం అని పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నాయకులు ప్రజలకు వాగ్దానం చేశారన్నారు. ప్రజలు నమ్మి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. ఇప్పుడు ప్లాంట్‌ను అగాథంలోకి నెట్టే చర్యలను కేంద్రం చేపడుతుంటే కూటమి కేంద్రాన్ని నిలదీయకపోవడం ప్రజల ఆశలను వమ్ము చేయడమేనని ఆరోపించారు. రాజకీయంగా ఇంతటి అనుకూల పరిస్థితి గతంలో లేదు. అయినా మోదీ ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడటం కన్నా రాష్ట్ర ప్రయోజనం వీరికి ఏముందని ప్రశ్నించారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు పాతగాజువాక జంక్షన్‌లో తలపెట్టే మహాధర్నాకు ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

పోరాడి సాధించుకున్న ఉక్కును కాపాడుకుంటాం



ఉక్కు రిలే దీక్షా శిబిరంలో పాల్గొన్న పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: నిర్వాసితులు వేల ఎకరాల ధారాదత్తం, 32 మంది అమరుల ప్రాణ త్యాగంతో, పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరిస్తామంటే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరని, సమయం వచ్చినప్పుడు తీవ్ర ప్రతిఘటన ఎదుర్కొక తప్పదని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రకటనకు నిరసగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల నేతృత్వంలో 1,309 రోజుల నుంచి రిలే దీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. దీక్షా శిబిరంలో ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉక్కు కర్మాగారాన్ని అస్థిరపర్చి, కార్మికుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తోందని, ఇటువంటి దుశ్చర్యలను కార్మిక వర్గం వ్యతిరేకిస్తుందన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు పన్నినా, పోరాటలు, ఉద్యమాలతో అడ్డుకుంటామన్నారు. తక్షణం ఉక్కును సెయిల్‌లో విలీనం చేసి, పూర్తి సామర్థ్యంతో ఉక్కును నడిపేందుకు వీలుగా ముడి సరుకులు అందివ్వాలని, అవసరమైన ఆర్థిక సహాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, కె.రాజబాబు, బీఎంఎల్ నాయుడు, పి.పెద్దిరాజు, బీవీ సత్యనారాయణ, సైనబాబు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 19.9 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సేవకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపు గురువారం దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. 61 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలకు సంబంధించి రూ.19,09,971 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీజీవీ బ్యాంక్, కంచరపాలెం పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ ఉద్యోగులు, శ్రీవారి స్వచ్ఛంద సేవకులు తదితరులు లెక్కింపులో పాల్గొన్నారు.